
www.journalistvaartha.com
24 Oct 2026 - Page 4

రోడ్ల విస్తరణ చేసినా ప్రయోజనం ఏది?

రోడ్డుపైనే చెరు వ్యాపారాలు.. పట్టించుకోని గ్రామపంచాయతీ! -లాభాల్లో ఎవరి వాటా ఎంత? బాధ్యత ఎవరిది?





3

జర్నలిస్ట్ వార్త కథనంతో కదిలిన అధికారులు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -128 ఆదివారం 25 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



అల్లూరి జిల్లాలో పేలుడు ప్రమాదం..

రోడ్డు పనుల కోసం కొండను పేల్చుతుండగా ఘటన

ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి

మృతుల్లో టీచర్, డ్రైవర్, ముగ్గురు కూలీలు

అనంతగిరి అక్టోబర్ 24:(జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం కొండను పేల్చే క్రమంలో జరిగిన పేలుడులో ఐదుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. అనంతగిరి మండలం పినకోట సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మిగతాది 2లో...

రక్షణ రంగాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలి

"రక్షా ఎక్స్‌పో - కర్టెన్ రైజర్" కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

దేశ రక్షణ ఉత్పత్తుల తయారీలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలి

పెట్టుబడులను రెట్టింపు చేయండి.. పరిశ్రమలకు పూర్తి సహకారం అందిస్తాం

త్వరలో ఏరోస్పేస్, రక్షణ రంగ పాలసీ 2.0



హైదరాబాద్, అక్టోబర్ 24:(జర్నలిస్ట్ వార్త):
రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపాలన్నదే తమ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణను ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు, దిగుమతులపై ఆధారపడే స్థాయి నుంచి ఆయుధాలు,మిగతాది 2లో...



కేంద్ర నిధులపై తెలంగాణ ఫోకస్

: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం

కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన

అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి

హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 24: (జర్నలిస్ట్ వార్త):
కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మిగతాది 2లో...

ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు..

నువ్వా నేనా అంటున్న టీడీపీ, వైసీపీ

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భారీగా దాఖలైన నామినేషన్లు

ఎంపీటీసీలకు 51,902, జెడ్పీటీసీలకు 5,724 నామినేషన్లు

నామినేషన్ల దాఖలులో టీడీపీ, వైసీపీ మధ్య తీవ్ర పోటీ

ప్రభుత్వంపై జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్న కూటమి

జగన్‌ది 'హిట్ అండ్ రన్' రాజకీయమంటూ విమర్శలు



షర్మిలకు జగన్ లేఖ..

మేనకోడలి పెళ్లికి బెంగళూరు ఇల్లు వద్దని స్పష్టీకరణ

కుమార్తె పెళ్లి తన బెంగళూరు నివాసంలో వద్దని లేఖలో జగన్ స్పష్టీకరణ

తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని వివరణ

ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్ పాండ్‌ను పరిశీలించాలని సూచన



అమరావతి అక్టోబర్ 24: (జర్నలిస్ట్ వార్త):
వైసీపీ అధినేత జగన్ తన సోదరి షర్మిలకు రాసిన ఓ లేఖను ఆ పార్టీ తాజాగా విడుదల చేసింది. షర్మిల కుమార్తె అంజలి వివాహానికి సంబంధించి అక్టోబర్ 9న రాసిన ఈ లేఖలో, పెళ్లి వేదిక విషయంలో మిగతాది 2లో...

అతి తీవ్ర తుపాను..

బంగాళాఖాతంలో వాయుగుండం.. అతి తీవ్ర తుపానుగా మారే సూచన

అక్టోబర్ 28న ఏపీ తీరాన్ని తాకవచ్చని అంచనా


బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం

తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో గాలులు

ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ



అమరావతి అక్టోబర్ 24:(జర్నలిస్ట్ వార్త):
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల-విశాఖపట్నంమిగతాది 2లో...



'అదే హింస.. అవే అబద్ధాలు'

స్థానిక ఎన్నికలపై జగన్ ది 'హిట్ అండ్ రన్' ధోరణి: సీఎం చంద్రబాబు

వైసీపీ హయాంలో జరిగిన ఘటనలపై 'అదే హింస.. అవే అబద్ధాలు' పేరుతో బుక్‌లెట్ విడుదల

గత ఐదేళ్లలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని చంద్రబాబు ఆరోపణ

ప్రజల నమ్మకంతో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని వెల్లడి

కోల్పోయిన బ్రాండ్ ఏపీని పునరుద్ధరించి, పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని స్పష్టీకరణ

అమరావతిఅక్టోబర్ 24:(జర్నలిస్ట్ వార్త):
వైసీపీ అధినేత జగన్ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో జగన్ 'హిట్ అండ్ రన్' విధానాన్ని అవలంబించారని, క్రిమినల్ లిటిగెంట్‌గా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేశారని మండిపడ్డారు. ఈ మేరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలపై 'అదే హింస.. అవే అబద్ధాలు.. అవే అరాచకాలు..' పేరుతో ఓ బుక్‌లెట్‌ను, సంబంధిత వీడియోలను ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో నక్సల్స్, రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, గత ప్రభుత్వ హయాంలో ఒక రాజకీయ పార్టీయే శాంతిభద్రతలకు అతిపెద్ద సమస్యగా మారిందని విమర్శించారు. వైఎస్ హయాంలో ఫ్యాక్షనిజంతో ప్రజలు భయపడితే, 2019 తర్వాత వైసీపీ పాలనలో ఎన్నికలను అపహాస్యం చేసి, పాలనను పూర్తిగా విధ్వంసం చేశారని ఆరోపించారు. స్వయానా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన ప్రాణాలకు భయం ఉందని ఫిర్యాదు చేసే దుస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు.గత ప్రభుత్వ అరాచకాలకు, విధ్వంసకర పాలనకు విసిగిపోయిన ప్రజలు 2024 ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్లను సాధించిందని, ఇది ప్రజలు మాపై పెట్టుకున్న అపారమైన నమ్మకానికి మిగతాది 2లో...

సెమీకండక్టర్ హబ్‌కు కేంద్రం మద్దతు

ఢిల్లీలో అమిత్ షా, అశ్విని వైష్ణవ్‌లతో చంద్రబాబు భేటీ.. రైల్వే, ఐటీ రంగాల్లో కీలక హామీలు

రాష్ట్ర అభివృద్ధి, రాజకీయ అంశాలపై అమిత్ షా, చంద్రబాబు మధ్య చర్చ

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తోనూ సమావేశమైన ముఖ్యమంత్రి

ఏపీలో రైల్వే ప్రాజెక్టులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి

విశాఖ నుంచి బెంగళూరుకు వందే భారత్ స్లీపర్ రైలుకు ఆమోదం

రాష్ట్రంలోని 9 పోర్టులకు రైల్వే కనెక్టివిటీ కల్పించేందుకు అంగీకారం

విజయవాడ బైపాస్ సహా పలు కీలక రైల్వే ప్రాజెక్టులను ప్రతిపాదించిన సీఎం



ఢిల్లీ అక్టోబర్ 24: (జర్నలిస్ట్ వార్త):
ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులతో జరిపిన సమావేశాలు ఫలప్రదంగా ముగిశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో రైల్వే, ఐటీ రంగాల అభివృద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో జరిపిన భేటీలో పలు కీలక హామీలు, ఆమోదాలు లభించాయి. రాష్ట్ర భవిష్యత్‌కు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ డిజైన్, ఏఐ రంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో మిగతాది 2లో...

ఆయుక్షణం ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

అతి తీవ్ర తుపాను..

(మొదటి పేజీ తరువాయి)

మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ చేసింది.

న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ-వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్-జూలియన్ ఆసిలేషన్ (వీజీం) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు.

ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు

'అదే హింస.. అవే అబద్ధాలు'

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే పనిలో నిమగ్నమయ్యామని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించిందని ముఖ్యమంత్రి వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్‌తోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని గుర్తుచేశారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడం ద్వారానే ఉపాధి కల్పన సాధ్యమవుతుందని, కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, అవి ఉత్పత్తి దశకు వెళ్లేంత వరకూ ఫాలో అప్ చేసే పటిష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్న విషయాన్ని పొరుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశం గుర్తిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

అల్లూరి జిల్లాలో పేలుడు ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా కొండను తొలగించేందుకు కార్మికులు జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి పేలుడుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ టిప్పర్ లారీ పేలుడు ధాటికి అదుపుతప్పి బోల్తా పడింది.ఈ దుర్ఘటనలో ఒక టీచర్, టిప్పర్ డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతులను టీచర్ సునీత (వైజాగ్), మణి (దేవరాపల్లి), నారాయణ రావు (చీడికాడ), పవన్ కుమార్ (కడప)గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది.

గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

షర్మిలకు జగన్ లేఖ..

(మొదటి పేజీ తరువాయి)

జగన్ తన అభ్యంతరాలను, కారణాలను స్పష్టంగా వివరించారు.

మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని, కానీ అక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలను విస్మరించవద్దని షర్మిలను కోరారు. బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ తాము సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని జగన్ నొక్కిచెప్పారు. తన సొంత పిల్లల వివాహం విషయంలో కూడా భద్రత దృష్ట్యా తాను ఇలాంటి నిర్ణయమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినా, తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు.తన పరిస్థితిని అర్థం చేసుకొని, దయచేసి మరో వేదికను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లోనైనా వివాహం జరుపుకోవచ్చని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లకు సంబంధించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో, జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

కేంద్ర నిధులపై తెలంగాణ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ఠ ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు..

నువ్వా నేనా అంటున్న టీడీపీ, వైసీపీ

అమరావతి అక్టోబర్ 24: (జర్నలిస్ట్ వార్త):

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పరిషత్ పోరులో పోటీ చేసేందుకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి భారీ ఎత్తున స్పందన లభించింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఉన్న 659 జెడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఏకంగా 51,902 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల చివరి రోజున అత్యధికంగా జెడ్పీటీసీలకు 3,315, ఎంపీటీసీలకు 25,016 నామినేషన్లు రావడం ఎన్నికల వేడిని సూచిస్తోంది.

నామినేషన్ల దాఖలులో అధికార, ప్రతిపక్ష పార్టీలు నువ్వా నేనా అన్నట్లు పోటీపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ తరఫున అత్యధికంగా 22,013 నామినేషన్లు దాఖలు కాగా, వైసీపీ నుంచి 20,556 మంది నామినేషన్లు వేశారు. ఇక జనసేన పార్టీ తరఫున 4,609 మంది, బీజేపీ నుంచి 1,150 మంది తమ అభ్యర్థిత్వాలను నమోదు చేసుకున్నారు.

అదేవిధంగా, జెడ్పీటీసీ స్థానాలకు కూడా ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది. టీడీపీ తరఫున 2,078 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్ఆర్సీపీ నుంచి 1,815 మంది బరిలో నిలిచారు. కూటమిలోని జనసేన పార్టీ నుంచి 679 మంది, బీజేపీ తరఫున 255 మంది నామినేషన్లు వేశారు.

ఇంత భారీ సంఖ్యలో ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు దాఖలైనప్పటికీ, కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. జగన్ తీరును 'హిట్ అండ్ రన్' థియరీగా వారు అభివర్ణిస్తున్నారు.

కేవలం ప్రెస్ మీట్లు పెట్టడానికే బెంగళూరు నుంచి అమరావతికి వస్తున్నారని, నిరాధార ఆరోపణలు చేసి తిరిగి వెళ్లిపోతున్నారని కూటమి పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను గమనించకుండా జగన్ వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. మొత్తం మీద నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో పరిషత్ ఎన్నికల రాజకీయం మరింత వేడెక్కింది.

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా..

మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 24: (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

సెమీకండక్టర్ హబ్‌కు కేంద్రం మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమై రాష్ట్ర ప్రగతికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. ఈ భేటీలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చ జరిగింది. ఒకటి, ఆంధ్రప్రదేశ్‌ను సెమీకండక్టర్ డిజైన్, తయారీ రంగంలో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడం.

రెండోది, రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం. ఈ రెండు అంశాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారు. సెమీకండక్టర్ రంగంలో పరిశోధన, అభివృద్ధి (=&ణ), నైపుణ్య శిక్షణ, సామర్థ్యాల పెంపునకు ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ద్వారా అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. అలాగే, కృత్రిమ మేధ (ూ×) అభివృద్ధి, ఏఐ మౌలిక సదుపాయాల కల్పనలోనూ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు.రైల్వే రంగంలో రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను, అవసరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లకు (ణూ=) ఆమోదం తెలిపి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి, పలు కీలక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని 9 పోర్టుల నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు సరుకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అవసరమైన రైల్వే కనెక్టివిటీని



పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పోర్టుల ద్వారా ఎగుమతులు, దిగుమతులు పెరిగి పారిశ్రామికాభివృద్ధికి ఊతం లభిస్తుందని సీఎం పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు భారీ ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ బైపాస్ లైన్ నిర్మాణానికి రూ.3,197 కోట్లు, కొవ్వూరుభద్రాచలం రైల్వే ప్రాజెక్టుకు రూ.2,860 కోట్లు, ఒంగోలుదొనకొండ రైల్వే ప్రాజెక్టుకు రూ.1,800 కోట్లు, అనకాపల్లికొత్తవలస బైపాస్ ప్రాజెక్టుకు రూ.2,190 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. విజయవాడ బైపాస్‌లో భాగంగా కృష్ణా నదిపై రెండు కొత్త వంతెనల నిర్మాణం ఆవశ్యకతను నొక్కిచెప్పారు. అమరావతివిశాఖపట్నం మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటు చేయాలని, అలాగే విజయవాడఇటార్సీ, ఖరగ్‌పూర్‌విజయవాడ రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచేలా నాలుగు లైన్ల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని సూచించారు. అమరావతి, విశాఖపట్నంలో భారీ కోచింగ్ టెర్మినళ్ల ఏర్పాటుకు, రైల్వే పీఎస్‌యూ కార్యాలయాలను అమరావతిలో నెలకొల్పే అంశంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది.విశాఖ వాసులకు శుభవార్త.. కొత్త రైళ్లకు పచ్చజెండాప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే దిశగా ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే స్పందించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు స్లీపర్ సౌకర్యంతో కూడిన వందే భారత్ రైలును నడిపేందుకు ఆయన అంగీకారం తెలిపారు. దీనితో పాటు, విశాఖపట్నంతిరుపతి మధ్య పగటిపూట సీటింగ్ సౌకర్యంతో మరో ప్రత్యేక రైలును ప్రవేశపెట్టేందుకు కూడా సమ్మతించారు. కొత్తగా నిర్మించిన కనిగిరివిజయవాడ రైల్వే మార్గంలో ప్రయాణికుల రైలు సేవలను వెంటనే ప్రారంభించాలని సీఎం కోరారు. ముఖ్యమంత్రి వెంట ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు. మొత్తం మీద, ఈ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా సాగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు. ఈ రాత్రి ఢిల్లీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి విజయ్ బిష్ణోయ్ ఇంట జరిగే పెళ్లి వేడుకలో చంద్రబాబు పాల్గొననున్నారు. చంద్రబాబు శనివారం రాత్రి ఢిల్లీలోనే బస చేసి, ఆదివారం ఉదయం విజయవాడకు తిరిగి రానున్నారు.

రక్షణ రంగాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ సాంకేతికతను ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదగాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో శనివారం నిర్వహించిన రక్ష ఎక్స్‌పో-2026 ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశీయ, అంతర్జాతీయ రక్షణ రంగ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులను పెంచాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులు తమ ప్రణాళికలను మరింత విస్తరించాలని సూచించారు.

రక్షణ రంగంతోపాటు ఏరోస్పేస్, అంతరిక్ష పరిశోధనలు, సైబర్ భద్రత, కృత్రిమ మేధ, డ్రోన్ సాంకేతికత వంటి రంగాల్లోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రంగాల్లో పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు కలిసి పనిచేస్తే దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచవచ్చన్నారు.

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేందుకు త్వరలో ఏరోస్పేస్, రక్షణ రంగ పాలసీ 2.0ను ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను పెంచడంలో రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంతోపాటు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

రక్షణ పరిశోధనలు, విమానయాన రంగాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. డీఆర్‌డీవో, హెచ్ఏఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిశ్ర ధాతు నిగమ్ వంటి సంస్థలతోపాటు పలు ప్రైవేటు రక్షణ, విమానయాన సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

ఈ పారిశ్రామిక పునాదులను ఉపయోగించుకొని అధునాతన రక్షణ ఉత్పత్తుల తయారీ, పరిశోధన, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

రక్షణ, విమానయాన పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం, పరిశ్రమలువిద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించవచ్చన్నారు.

రక్షణ రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల తయారీ రంగం అభివృద్ధి చెందడంతోపాటు, స్థానిక సంస్థలకు వ్యాపార అవకాశాలు, యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని పరిశ్రమల వర్గాలు భావిస్తున్నాయి.

ఓటు తొలగించారని ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు..

ఆధారాలు ఉంటే చూపండి: రేవంత్‌కు బీజేపీ సవాల్

ఓట్ల తొలగింపు పేదలకు వ్యతిరేకంగా బీజేపీ పన్నిన కుట్ర అని సీఎం ఆరోపణ

ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్

'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ

నవంబర్ 1 నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్‌లో బీజేపీ యాత్రలు

హైదరాబాద్, అక్టోబర్ 24: (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు.ఈ ఆరోపణలపై శుక్రవారం రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు.ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు పాల్గొంటుండడాన్ని కూడా రాంచందర్ రావు తప్పుబట్టారు. దీనికి ప్రతిగా, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకానికి వ్యతిరేకంగా పోరాడండి' అనే నినాదంతో బీజేపీ పాదయాత్రలు నిర్వహిస్తుందని ప్రకటించారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమై, ఆ తర్వాత సిద్దిపేట, కరీంనగర్‌లో కొనసాగుతుందని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.

ఘనంగా మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసిన అభిమానులు



స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఉప మండల పరిషత్ అధ్యక్షుడు చల్లా సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యుడు బొల్లం నాగరాజు, యువజన నాయకుడు పాలకుర్తి నాగరాజు, పులి రవి, దామెర శ్రీనివాస్, భూస రాకేష్, కాసర్ల తిరుమలేష్, భూస రాజకుమార్, ప్రీ ప్రైమరీ పాఠశాల బోధకురాలు కొంపెల్లి కవిత, ఆయా సరిత తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్ సమీపంలో

ఘోర రోడ్డు ప్రమాదం

టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు





దామరచర్ల/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):
నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. టీఎస్05యూఈ 9195 నంబరు గల టిప్పర్ లారీ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడంతో వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. టిప్పర్ అతివేగంగా రావడమే ప్రమాదానికి కారణమని సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

స్పీడ్ బ్రేకర్ల వద్ద జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలి

ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలి

ఎల్కతుర్తి/సెప్టెంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):



ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు వల్లభాపూర్‌లోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాల సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున స్పీడ్ బ్రేకర్లు సరిగా కనిపించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. ఈ ప్రమాదాల కారణంగా పలువురు తీవ్రంగా గాయపడి అంగవైకల్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల వల్లభాపూర్ గ్రామ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడటంతో 108 అంబులెన్స్ ద్వారా హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.స్పీడ్ బ్రేకర్లకు ఇరువైపులా స్పష్టంగా కనిపించేలా జీబ్రా లైన్లు, హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలని వల్లభాపూర్ గ్రామానికి చెందిన కట్కూరి గౌతమ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా పాఠశాల సమీపంలో విద్యార్థులు, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. సంబంధిత రవాణా, రహదారుల అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనుమతులు లేని డీజేలపై కేసు..

రెండు వాహనాలు స్వాధీనం

అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు.. ప్రమాదకరంగా వాహనాల నడిపింపు





తల్లాడ/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):ఖమ్మం జిల్లా తల్లాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముద్దునూరు గ్రామంలో అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. డీజే సౌండ్ సిస్టమ్‌లను అమర్చిన రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 23వ తేదీ రాత్రి ముద్దునూరు గ్రామంలోని రామాలయం గుడి సెంటర్‌లో బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా రెండు వాహనాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసి అధిక శబ్దంతో పాటలు వినిపిస్తున్నట్లు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందింది. డీజేలకు అవసరమైన అనుమతులు లేకపోవడంతోపాటు, వాహనాలను ముందుకు వెనక్కు ప్రమాదకరంగా నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించినట్లు పోలీసులు గుర్తించారు.

జర్నలిస్ట్ వార్త కథనంతో

కదిలిన అధికారులు

చెన్నారావుపేట కూడలిలో చిరు వ్యాపారులకు నోటీసులు

నోటీసులకే పరిమితం కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



నర్సంపేట/ అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):
వార్త ప్రచురితమైతేనే అధికారుల్లో కదలిక వచ్చిందా? చెన్నారావుపేట కూడలిలో చిరు వ్యాపారుల దుకాణాలతో రాకపోకలకు తీవ్ర అంతరాయం


జర్నలిస్ట్ వార్త

రోడ్ల విస్తరణ చేసినా ప్రయోజనం ఏది?

బోర్డుపైనే చిరు వ్యాపారాలు.. పట్టించుకోని గ్రామపంచాయతీ! -లాభాల్లో ఎవరి వాటా ఎంత? బాధ్యత ఎవరిది?

కలుగుతున్నా, రోడ్డు ప్రమాదాల ముప్పు పొంచి ఉన్నా అధికారులు స్పందించాల్సిన పరిస్థితిని జర్నలిస్టు వార్త వెలుగులోకి తెచ్చింది. శనివారం ప్రచురితమైన కథనంపై గ్రామపంచాయతీ అధికారులు స్పందించి చర్యలకు దిగారు.
నర్సంపేట డివిజన్‌లోని చెన్నారావుపేట కూడలిలో రహదారిపై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల దుకాణాల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల రద్దీకి తోడు దుకాణాలతో రహదారి ఇరుకుగా మారడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న అంశాన్ని



జర్నలిస్ట్ వార్త కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి సుప్రజ సిబ్బందితో కలిసి పలువురు చిరు వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు.

సూరారంలో తంగేడ గోపాల్‌రావు శతజయంతి వేడుకలు

తంగేడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం..

కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం

ఎల్కతుర్తి/సెప్టెంబర్ 24 (జర్నలిస్ట్ వార్త):
స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాసేవకుడు తంగేడ గోపాల్‌రావు సేవలను స్మరించుకుంటూ ఆయన జన్మదిన శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సూరారం గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తంగేడ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి. ప్రేమానందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు విశేష సేవలందించిన గోపాల్‌రావు ఆశయాలను కొనసాగించడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
గోపాల్‌రావు స్వాతంత్ర్య సమరయోధుడిగా, గ్రామ సర్పంచిగా, సమితి సభ్యుడిగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. 1967లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి జనసంఘ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నించారని వివరించారు. గ్రామంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచి, అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.



గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.
శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధన్వంతరి హోమం పేరిట ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ, వివిధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అన్ని గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో పాటు వరంగల్‌కు చెందిన ప్రాంతీయ ఆయుష్ ఆయుర్వేద వైద్యులు రామలింగరాజ్, వివిధ వ్యాధులకు చికిత్స అందించే వైద్యులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.
అలాగే సూరారం గ్రామంలో తంగేడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. గోపాల్‌రావు సేవలను భావితరాలకు తెలియజేయడంతో పాటు గ్రామంలో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమానందరావు, డాక్టర్ రామ్‌మోహన్‌రావు, తంగేడ మహేందర్, తక్కళ్లపల్లి సంపత్‌రావు, ఎర్రబెల్లి సంపత్‌రావు, నడిపెల్లి ప్రభాకర్‌రావు, సీడ్ ఆర్గనైజర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ సంకీర్తన, ప్రహ్లాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలర్పించిన పోలీసుల

త్యాగం మరువగలమా?

ప్రజల రక్షణే లక్ష్యం.. ప్రాణత్యాగమే సాక్ష్యం!

అమరవీరుల సేవలు చిరస్మరణీయం.- సీఐ విశ్వేశ్వర్





గీసుకొండ/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): ప్రజల ప్రాణాలు, సమాజ భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని గీసుకొండ సీఐ డి.విశ్వేశ్వర్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గీసుకొండ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు, దేశ రక్షణ కోసం చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూరు ఏసీపీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ ర్యాలీలో సుమారు 150 మంది పాల్గొన్నట్లు తెలిపారు.గొర్రెకుంటలో ప్రారంభమైన ర్యాలీ జాన్‌పీర్ల మీదుగా గొర్రెకుంట క్రాస్ వరకు కొనసాగింది. ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

ప్రత్యామ్నాయ పంటల సాగుకు కలెక్టర్ సూచన



వరంగల్/అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త);ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం, నెక్కొండ మండలాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వర్ధన్నపేట మండలం కొత్తపల్లి, పర్వతగిరి మండలం సోమారం, తీగరాజుపల్లి, సోమ్లాతండా, పత్తిపాక గ్రామాల్లో చేపట్టిన వ్యవసాయ కుంటలు, గ్రామ సంఘాల భవనాలు, సాగునీటి చెరువుల పనుల పురోగతిని సమీక్షించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి పనుల అమలు తీరును తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా మొక్కజొన్న, కందులు, మినుములు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో డీఆర్డీవో నాగపద్మజ, జడ్పీ సీఈవో వసంత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అణగారిన ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

మోదీ సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేర్చాలి

అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాల ఫలాలు అందేలా కృషి చేయాలి

ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా మాచర్ల అనిరుద్ కౌండిన్య గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక





ధర్మసాగర్/ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, రైతులు, కార్మికులు, అసంఘటిత రంగ ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే లక్ష్యంగా ఓబీసీ మోర్చా నాయకులు పనిచేయాలని జనగామ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్లకొండ రవి, జిల్లా ఇన్‌చార్జి పోచం సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి రాజు పిలుపునిచ్చారు. పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అర్హులకు ప్రయోజనం చేకూరేలా నాయకులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.శనివారం ధర్మసాగర్‌లో ఓబీసీ మోర్చా మండల కమిటీ ఏర్పాటు సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హత ఉన్నప్పటికీ పథకాల ప్రయోజనాలు అందని కుటుంబాలను గుర్తించి వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల అమలులో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.అనంతరం ధర్మసాగర్ మండల ఓబీసీ మోర్చా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాచర్ల అనిరుద్ కౌండిన్య గౌడ్‌ను ఎంపిక చేశారు. నూతన కమిటీ ప్రజా సమస్యల పరిష్కారానికి, ఓబీసీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బైరిపాక కుమార్, ప్రధాన కార్యదర్శి శివ, సీనియర్ నాయకుడు గంకిడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి: డీఐఈఓ రవిబాబు





సత్తుపల్లి/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకుల హాజరు పట్టికలు, విద్యార్థుల హాజరు వివరాలు, విద్యా సంబంధిత రికార్డులను పరిశీలించారు. యూనిట్, అర్ధవార్షిక పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను సమీక్షించారు. అధ్యాపకుల బోధనా దినచర్య పుస్తకాలను పరిశీలించి, పాఠ్యాంశాల బోధన పురోగతిని తెలుసుకున్నారు.రాబోయే ప్రయోగ పరీక్షలకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందో లేదో పరిశీలించారు. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్ర ప్రయోగశాలలను తనిఖీ చేశారు. ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను ముందుగానే సన్నద్ధం చేయాలని సూచించారు.మార్చి 2027లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రణాళికాబద్ధంగా బోధించాలని డీఐఈఓ సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి సామర్థ్యాలను మెరుగుపరిచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గత సంవత్సరాల మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యార్థులు మెరుగైన ఫలితాలు, ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధ్యాపక బృందం సమష్టిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా బోధించాలని డీఐఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భాగ్యలక్ష్మితో పాటు అధ్యాపకులు వనజరాణి, కల్పన, కృష్ణవేణి, రామారావు, రాణి, శ్వేత, శిరోమణి, సమ్మక్క, వెంకటేశ్వరరావు, సౌజన్య, సీత పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్

ప్రజలకు పోలీస్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలి దర్యాప్తు నివేదికలు, రికార్డుల నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి



మహబూబాబాద్/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):

మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు పోలీస్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లోని ఈ-కాప్స్ విభాగం, రైటర్స్ రూమ్‌ను ఎస్పీ పరిశీలించారు. నేరాలు, నేరస్తుల సమాచార నమోదు వ్యవస్థ పనితీరుతో పాటు కేసులకు సంబంధించిన వివరాలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. కేసుల సమాచారం ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ఈ-సాక్ష్య వివరాల నవీకరణ, పెండింగ్ కేసులు, ఈ-సమన్లు, ప్రథమ సమాచార నివేదికలు, దర్యాప్తు నివేదికల తయారీ తదితర అంశాలపై ఈ-కాప్స్ రైటర్‌తో పాటు రూరల్ ఎస్ఐ పిల్లల రాజుతో ఎస్పీ చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, దర్యాప్తు నివేదికలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని, దర్యాప్తులో నాణ్యత, పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తాగునీటి భరోసా..

గోదావరిలో ఒక టీఎంసీ నీటి నిల్వకు చర్యలు -దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటి నిల్వ ఏర్పాట్లు

సీఎం రేవంత్ రెడ్డిని కోరిన మంత్రి తుమ్మల.. దీపావళి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు





భద్రాద్రి కొత్తగూడెం/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గోదావరి నదిలో నీటి నిల్వను పెంచి ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసే పనులు చేపట్టారు. ఆనకట్టపై సుమారు ఒక మీటరు ఎత్తున ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

సీఎం దృష్టికి మంత్రి తుమ్మల

గోదావరిలో నీటిని నిల్వ చేయాల్సిన ఆవశ్యకతను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీసుకెళ్లారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి అవసరాల దృష్ట్యా ఈ పనులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ ముఖ్య ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద పనులు కొనసాగుతున్నాయి. పనుల పురోగతిపై మంత్రి తుమ్మల ఎప్పటికప్పుడు అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు. నీటి నిల్వకు అవసరమైన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచిస్తున్నారు. దీపావళి నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి సరఫరాకు భరోసా కల్పించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై సవతి ప్రేమ ఎందుకు?

పదేళ్లుగా వేతన పెంపు లేదు.. ఉద్యోగ భద్రత కరువు సేవలు క్రమబద్ధీకరించి న్యాయం చేయాలి: మైస ఉపేందర్ మాదిగ



హనుమకొండ/ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. పదేళ్లుగా వార్షిక వేతన పెంపుదల లేకుండా, వేతన సవరణ అమలు చేయకుండా ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హామీలు కాదు.. హక్కులు కల్పించాలి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, వేతనాల పెంపు, ప్రసూతి సెలవులు కల్పించడంతోపాటు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని నిలదీశారు. హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ సహా ఎనిమిది రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి తెలంగాణలోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. జీవో 1195తో తగ్గిన వేతనాలపై సమాధానం చెప్పాలి జీవో 1195 కారణంగా వేతనాలు తగ్గిన ఉద్యోగులకు తక్షణమే న్యాయం చేయాలని మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను ఏళ్ల తరబడి పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే వైద్య సేవలందించే ఉద్యోగుల హక్కులను కాపాడాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



జనగామ/చేర్యాల, అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక నరసవ్వకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శనివారం అందజేశారు. ఆర్థిక సహాయం అందేలా సహకరించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు గ్రామస్తులకు నరసవ్వ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శైలజా శివశంకర్‌గౌడ్, ఉపసర్పంచ్ కిరణ్‌కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగే కనకయ్య, వార్డు సభ్యులు ఏలుసాని యాదగిరి, రోమాల సురేష్, ఆలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల 9వ వార్డు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా నర్ర మహేష్ ఏకగ్రీవ ఎన్నిక



జనగామ/చేర్యాల అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): చేర్యాల మున్సిపాలిటీలోని 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా నర్ర మహేష్, ఉపాధ్యక్షులుగా బుడిగె కిషన్, నర్ర రమేష్, ప్రధాన కార్యదర్శులుగా ఉడుగుల లింగం, నర్ర కేశవులు, అల్లం రమేష్, బస్వరాజు క్రిష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, కొమరవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, మార్కెట్ డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్య, నాయకులు ఎండీ ఖాజా, ఉట్లపల్లి శ్రీనివాస్, ఐత శ్రీనివాస్, బందెల మహిపాల్‌రెడ్డి, కాటం శ్రీనివాస్, చింతల మల్లేశం, నీలం సన్నీ, తుమ్మలపల్లి సంతోష్, మల్లిగారి నరసింలు, పచ్చిమడ్ల సత్యనారాయణ, అంబాల రాము తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ నేతల ప్రత్యేక దృష్టి

నమోదు కేంద్రాలను సందర్శించి పట్టభద్రుల ఓట్లు చేర్పించిన గొడుగునూరి లక్ష్మారెడ్డి, తాళ్ల జోసెఫ్



తల్లాడ/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):

ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ పిలుపునిచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలను వారు సందర్శించారు.ఈ సందర్భంగా కుర్నవల్లి కేంద్రం పరిధిలోని గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై పట్టభద్రుల ఓటరు నమోదుపై చర్చించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి ఓట్లను నమోదు చేయించారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ వీలైనంత త్వరగా ఓటు హక్కును నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని సూచించారు.ముద్దునూరు గ్రామంలో సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించి, అర్హులైన పట్టభద్రులు నూతనంగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రెడ్డిగూడెం గ్రామంలో సర్పంచ్ మోదుగు తిరుమలరావు, ఉపసర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో నమోదు కేంద్రాన్ని సందర్శించి నూతన పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించారు.ఈ కార్యక్రమాల్లో కుర్నవల్లి, బసవపురం, కలకొడిమ, కేశవపురం, ముద్దునూరు, రెడ్డిగూడెం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

కిష్టాపురం తండాలో నూతన కల్వరి బాప్టిస్ట్ చర్చి ప్రారంభం



కేసముద్రం/ అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామ పరిధిలోని కిష్టాపురం తండాలో నూతనంగా నిర్మించిన కల్వరి బాప్టిస్ట్ చర్చి ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ లాల్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చర్చిని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చీర వెంకటమ్మ వీరస్వామి, మాజీ సర్పంచ్ గంధసిరి వెంకన్న, గంధసిరి వెంకటాద్రి, బత్తుల నరేష్, జాటోత్ సోమ్లా, రవి, హనుమా హాజరయ్యారు.
ఈ సందర్భంగా సర్పంచ్ చీర వెంకటమ్మ వీరస్వామి మాట్లాడుతూ గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. నూతనంగా నిర్మించిన ప్రార్థనా మందిరం గ్రామంలో శాంతి, సౌభాగ్యాలకు నిలయంగా నిలవాలని ఆకాంక్షించారు. చర్చి నిర్మాణానికి కృషి చేసిన పాస్టర్ లాల్ సింగ్‌తో పాటు సహకరించిన విశ్వాసులందరికీ అభినందనలు తెలిపారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

చలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయాలి.. గుగులోతు రతన్‌సింగ్ పిలుపు



స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): వివిధ రంగాల కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల చిల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రతన్‌సింగ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం చిల్పూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీఓకు గుగులోతు రతన్‌సింగ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల సాధన, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కోసం చేపట్టిన పోరాటంలో జనగామ జిల్లా కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ

11 మంది వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ మిత్ర సహకారంతో చేయూత



కల్లూరు/ అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): మండల పరిధిలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఖమ్మం నెహ్రూ నగర్‌లోని పెద్దినేని జోత్స్న, పెద్దినేని శ్రీకాంత్ మెటర్నిటీ అండ్ ఫెర్టిలిటీ ఆసుపత్రిని నిక్షయ్ మిత్రగా నమోదు చేసుకుని, వారి సహకారంతో 11 మంది టీబీ రోగులకు పోషకాహార కిట్లను అందజేశారు.
డాక్టర్ ఇస్రాత్ తబస్సుమ్, డాక్టర్ సాకేత్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు క్షయ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలు, పోషకాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి పూర్తిగా నయం కావాలంటే వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలని, చికిత్స మధ్యలో నిలిపివేయకూడదని సూచించారు.

ఎస్సై ప్రవీణ్‌కు అంబేద్కర్ సంఘం నాయకుల శుభాకాంక్షలు



వర్ధన్నపేట/అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బి. ప్రవీణ్‌ను తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి తాటికాయల వివేకానంద, చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ బెల్లం కుమారస్వామి పాల్గొన్నారు.

సఫలీకృతమవుతున్న మిషన్ వైవిధ్యం

యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి
- నీరు, విద్యుత్ పొదుపుతో పాటు అధిక ఆదాయంపై దృష్టి సారించాలి. కలెక్టర్ స్నేహ శబరీష్





మహబూబాబాద్/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు, భూగర్భ జలాల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో రైతులు యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే ఆరుతడి పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. పంట మార్పిడి విధానంపై రైతుల్లో అవగాహన పెరుగుతోందని, స్వచ్ఛందంగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.
గార్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం 'కేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అపరాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, మల్బరీ, మునగ, పూలు, ఉల్లి, ఔషధ మొక్కలు వంటి మార్కెట్‌లో గిరాకీ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల ఎంపిక, సాగు విధానాలు, మార్కెట్ అవకాశాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

నీటి వనరుల సంరక్షణే లక్ష్యం

గార్ల మండల పరిధిలో 19,500 ఎకరాల సాగుభూమి, సుమారు 9,800 మంది రైతులు, 78 చెరువులు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పంట మార్పిడిని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం

ఇప్పటికే పంట మార్పిడి చేపట్టి ఆదాయం పొందుతున్న రైతులతో కలెక్టర్ మాట్లాడి సాగు వివరాలను తెలుసుకున్నారు. గుగులోతు గణేష్ నాయక్ బొప్పాయి, జక్కుల మహేష్ పెసర, సుభాష్ చంద్రబోస్ బెండ, టమాటా, నజీర్ పాషా డ్రాగన్ ఫ్రూట్స్, వాంకుడోత్ విర్యా నాయక్ ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు వివరించారు. గార్ల సర్పంచ్ బానోతు పార్వతి పది ఎకరాల్లో పెసర తదితర పంటలు సాగు చేసిన వివరాలను కూడా తెలుసుకుని ఇతర రైతులకు వివరించారు.

నీటి కుంటల నిర్మాణానికి ప్రోత్సాహం

వీబీ-జీ రామ్‌జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటలు, నీటి కుంటలు, ఊట కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో అందుబాటులో ఉన్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా లాభపడాలని అన్నారు.
సమావేశంలో భాగంగా ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద రైతులకు ఉచితంగా పెసర విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ, విద్యుత్, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, సాగునీటి శాఖల అధికారులు, మల్యాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసిని రైతులకు పంటల సాగు, నీటి వినియోగంపై అవగాహన కల్పించారు.
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, డీఆర్‌డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన రాజు, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, పశువైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఏడీఏ శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, విద్యుత్ శాఖ ఎస్ఈ దర్శన్ కుమార్, సర్పంచ్ బానోతు పార్వతి, ఆత్మ సభ్యుడు వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధికారి రామారావు, ఉద్యాన అధికారి శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఐక్యతకు టీసీసీ కృషి చేయాలి

ప్రతి మండలంలో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్‌ను బలోపేతం చేయాలి.. బిషప్ మానుకొండ సుదర్శనం





ఏన్కూర్/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం జన్నారం గ్రామంలోని అజయ్ పాల్ అమృత మందిరంలో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) ముఖ్య నాయకుల సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ మానుకొండ సుదర్శనం మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలో టీసీసీని బలోపేతం చేయడంతో పాటు క్రైస్తవుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు.టీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైబిల్ తరగతుల ద్వారా వేలాది మందికి బైబిల్‌పై శిక్షణ అందించి, సేవకులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో సంస్థను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించి, క్రైస్తవుల ఐక్యతకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీసీసీ రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి నిరీక్షణ రావు, రాష్ట్ర కార్యదర్శి ఏసుదాస్, జిల్లా కార్యదర్శి రాజరత్నం, జిల్లా అధ్యక్షులు గుంటి బాబురావు, దైవ సహాయం, టీసీసీ గాయకుడు ఇజ్రాయెల్, అజయ్ పాల్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సోదరీమణులు, టీసీసీ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. డీఎస్పీ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు ఎమ్మెల్యే నివాళులర్పించారు. ప్రజల ప్రాణాలు, సమాజ భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు. అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన పోలీసు అధికారులను, స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన దాతలను అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ డివిజన్ పోలీసు అధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు

అనుమతులు లేకుండా పటాకులు విక్రయిస్తే కఠిన చర్యలు

అక్రమ నిల్వలు, విక్రయాలపై పోలీసుల నిఘా



హసన్‌పర్తి/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):
రానున్న దీపావళి పండుగ నేపథ్యంలో ముందస్తు అనుమతులు లేకుండా పటాకులు, బాంబులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. బాణసంచా విక్రయించాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు, లైసెన్సులు పొందాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో, అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా నిల్వ ఉంచడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచుతారని తెలిపారు.

బైక్ ప్రమాదంలో గాయపడిన మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు దంపతులు..

పరామర్శించిన ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ నాయకులు



వర్ధన్నపేట/అక్టోబర్ 2 4(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్, మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, జన్ను యాకమ్మ బైక్ స్కిడ్ కావడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు చాడ కరుణాకర్ మాదిగ, ఎంఎస్పీ మాజీ మండల అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకుడు బిర్రు రవీందర్ మాదిగ తదితరులు వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే నాగరాజు చొరవ

మంత్రులను కలిసి సమస్యల పరిష్కారానికి వినతి



వర్ధన్నపేట/అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త):
మున్సిపాలిటీ అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి శనివారం హైదరాబాద్‌లో పలువురు రాష్ట్ర మంత్రులను కలిశారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. మంత్రులు సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ తెలిపారు. వర్ధన్నపేట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ఎమ్మెల్యే నాగరాజు స్వయంగా మంత్రుల వద్దకు తీసుకెళ్లి సమస్యలను వివరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నేతవత్ శిబారాణి రాజేందర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పత్తి భాను, కాంగ్రెస్ నాయకులు శ్రీపాద సతీష్, నాంపెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.







ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలే మేలు

ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలే మేలు -రైతులకు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు







వర్ధన్నపేట/అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త):
ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రబీ సీజన్‌లో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట రైతు వేదికలో సర్పంచి దుబ్బ అంజయ్య అధ్యక్షతన 'ఖేతీ బచావో అభియాన్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న సాగును తగ్గించి పెసర, మినుము, కంది, శనగ, వేరుశనగ, నువ్వులు, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి పంటలను నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. మామిడి తోటల్లో బిందు, తుంపర సేద్య పద్ధతులను అవలంబించాలని, నీటి నిల్వకు వ్యవసాయ క్షేత్రాల్లో కుంటలు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. పంట మార్పిడి, వ్యవసాయ అవశేషాల నిర్వహణ, సమగ్ర వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే మామునూరు శాస్త్రవేత్త రాజు, మండల వ్యవసాయ అధికారి పి. విజయ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి జె. వేణుమాధవ్, పశువైద్యాధికారి కిరణ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి టి. మురళి, ఉద్యానవన విస్తరణ అధికారి యు. రాజర్షి, ఆత్మ డైరెక్టర్ వరదారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలివ్వాలి

ఎమ్మార్పీఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్ మాదిగ





కాజీపేట/అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురం రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన రైతులతోపాటు స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం నుంచి ప్రారంభోత్సవం వరకు తెలంగాణ రైల్వే జేపీసీ, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాలు పలుమార్లు శాంతియుత ర్యాలీలు, పాదయాత్రలు, ధర్నాలు నిర్వహించి తమ సమస్యలను విన్నవించినా స్పష్టమైన హామీ లభించలేదని పేర్కొన్నారు. డిసెంబరులో కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో, భూములు కోల్పోయిన రైతులు, స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల గోడు పట్టదా?

12 రోజులకు చేరిన దీక్షలు.. సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు -సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. జేఏసీ నేతలు











వరంగల్/ అక్టోబర్ 24 (జర్నలిస్ట్ వార్త):
ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ సంఘీభావం తెలిపింది. రాష్ట్రంలో 78 కేడర్లలో పనిచేస్తున్న 17,541 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కోరారు. ఉద్యోగులకు వంద శాతం స్థూల వేతనం, వార్షిక ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఆరోగ్య కార్డులు, బీమా సదుపాయాలు కల్పించాలని భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యుడు హరికృష్ణ హెచ్చరించారు. ఉద్యోగులు రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో వైద్యులు మోహన్, కిరణ్, సదానందం, మధు, ఐశ్వర్య, సునీతాదేవి, మేనేజర్ మెర్గు అనిల్‌కుమార్, నర్సింగ్ అధికారులు కళ్యాణి, మంజుల, సుమలత, ఫార్మసీ అధికారి జ్యోత్స్న, టీబీ విభాగం సిబ్బంది రంజిత్, రాకేశ్, ఏఎన్ఎంలు రాజేశ్వరి, ప్రభావతి, అనిత, శ్రీలత, ఎంఎన్ఓ ఏకుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక



వర్ధన్నపేట/ అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త):మాదిగ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండలం బండవతపురంలో శనివారం ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడి సాధించుకున్న ఫలాలను అందిపుచ్చుకోవాలంటే విద్యకు ప్రాధాన్యమివ్వాలని ఆయన సూచించారు. గ్రామ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా మరుపట్ల రోహిత్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా మరుపట్ల బింటు మాదిగ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రవి, రాజేష్, అఖిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు మరుపట్ల క్రాంతి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం..

ఆర్థిక సాయం పెంపు

అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త):సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది.వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు

విద్యకు దూరం కావొద్దు.. ఉన్నత శిఖరాలకు ఎదగాలి

బిర్రు మహేందర్ మాదిగ

వర్ధన్నపేట/అక్టోబర్ 24(జర్నలిస్ట్ వార్త):
మాదిగ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. నల్లబెల్లి విద్యానగర్ గ్రామంలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీల ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 ఏళ్ల పోరాటంతో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఏ ఒక్కరూ చదువుకు దూరమై మధ్యలోనే విద్యను ఆపేయొద్దని, విద్యాసంస్థల్లో సమస్యలు ఎదురైతే ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులను సంప్రదించాలని సూచించారు. గ్రామ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా బిర్రు జయకర్ మాదిగ, అధికార ప్రతినిధిగా బిర్రు కాన్సిరాం మాదిగ, ఉపాధ్యక్షులుగా బిర్రు బిట్టు, బిర్రు గణేశ్ మాదిగ ఎన్నికయ్యారు. బాలికల కమిటీ అధ్యక్షురాలిగా బిర్రు దీప్తి మాదిగ, అధికార ప్రతినిధిగా బిర్రు జయంతి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బిర్రు ప్రవస్తి మాదిగ, ఉపాధ్యక్షురాలిగా బిర్రు హాని మాదిగ, కార్యదర్శిగా బిర్రు నాన్సీ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు గోలి సుధాకర్ మాదిగ, బిరుదు బిక్షపతి, బిర్రు ప్రభాకర్, బిర్రు రవీందర్, బిర్రు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి







హైదరాబాద్.(జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే,ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రి వెల్లడించారు.

జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాంజర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు,వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు

పల్లె బిడ్డ.. వైద్య శిఖరం!

ఎనిగల్లు నుంచి ఎండీ వరకు.. డాక్టర్ మాసాని సుకుమార్ విద్యా ప్రస్థానం

పట్టుదల ఉంటే పల్లెల నుంచీ వైద్య రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నిరూపణ









వరంగల్ జిల్లా/అక్టోబర్ 2 4(జర్నలిస్ట్ వార్త):

గ్రామీణ నేపథ్యం.. అంచెలంచెలుగా సాగిన విద్యాభ్యాసం.. లక్ష్య సాధనలో పట్టుదల.. వెరసి వైద్య విద్యలో ఉన్నత మైలురాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఎనిగల్లు గ్రామానికి చెందిన డాక్టర్ మాసాని సుకుమార్ ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేశారు. సాధారణ గ్రామీణ కుటుంబం నుంచి వైద్య రంగంలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన ప్రస్థానం స్వగ్రామానికి గర్వకారణంగా నిలుస్తోంది.

ఎల్‌కేజీ నుంచి వైద్య విద్య వరకు.. సుకుమార్ ప్రాథమిక విద్య వర్ధన్నపేటలోని ఫుస్కోస్ పాఠశాలలో ప్రారంభమైంది. అక్కడ ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు చదివారు. అనంతరం కరీంనగర్‌లోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రతిభ పాఠశాలలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించారు. హనుమకొండలోని ప్రభుత్వ ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆ తర్వాత వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించారు. ఉన్నత వైద్య విద్యను లక్ష్యంగా చేసుకుని మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఇందిరాగాంధీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేశారు.గ్రామీణ యువతకు స్ఫూర్తి.. ఉన్నత విద్యకు పట్టణాలే చిరునామా కాదని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని సుకుమార్ విద్యా ప్రస్థానం చాటుతోంది. ప్రతిభకు గ్రామీణ నేపథ్యం అడ్డంకి కాదనే సందేశాన్ని అందిస్తోంది. వైద్య విద్యలో మరింత ముందుకు సాగాలనే లక్ష్యంతో కృషి చేసిన ఆయన ప్రస్థానం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తోంది.

ఎనిగల్లు గ్రామానికి చెందిన మాసాని గోపాల్, లక్ష్మి దంపతుల కుమారుడైన డాక్టర్ సుకుమార్ ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేయడం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మరెందరో ఉన్నత విద్యలో రాణించే అవకాశం ఉందనే విషయాన్ని ఆయన ప్రస్థానం గుర్తుచేస్తోంది.



‘సీడెడ్‘, ‘నైజాం‘ వద్దు.. ‘రాయలసీమ‘, ‘తెలంగాణ‘ అనండి

: దర్శకుడు రాహుల్ సాంకృత్యన్



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన ‘రణబాలి‘ చిత్రంపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ ప్రచారం చేశారని ఆ చిత్ర దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఆరోపించారు. అనంతపురంలో నిర్వహించిన ‘రణబాలి రణభేరి‘ విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కొందరు రివ్యూయర్లు సినిమాను నెగెటివ్‌గా చూపించే ప్రయత్నం చేసినప్పటికీ... మంచి సినిమాను ఎవరూ ఆపలేరని తెలుగు ప్రేక్షకులు మరోసారి నిరూపించారని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ తన అనంతపురం అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. “నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే పెరిగాను. ఇక్కడి థియేటర్లలోనే ‘ఇంద్ర‘, ‘నరసింహ నాయుడు‘ వంటి చిత్రాలు చూశాను. ఇప్పుడు అవే థియేటర్లలో నా సినిమా హౌస్‌ఫుల్ బోర్డులతో నడుస్తుండటం చాలా గర్వంగా ఉంది“ అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. మంచి సినిమా ఇస్తే రాయలసీమ ప్రజలు ఎప్పుడూ ముందుండి ఆదరిస్తారని కొనియాడారు. అలాగే, చిత్ర పరిశ్రమ వర్గాలు, మీడియాకు ఆయన ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. “మనం ఇప్పటికీ ట్రేడ్‌లో ‘సీడెడ్‘, ‘నైజాం‘ అని పిలుస్తున్నాం. దయచేసి ఆ పదాలు వాడకండి. అవి బానిసత్వాన్ని, బూర్జువా వ్యవస్థను గుర్తుచేస్తాయి. వాటికి బదులుగా ‘రాయలసీమ‘, ‘తెలంగాణ‘ అనే అందమైన తెలుగు పదాలనే వాడుదాం“ అని రాహుల్ సాంకృత్యన్ కోరారు. పీరియాడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అతడితో మాట్లాడడం ఆపేశాక బరువు పెరిగాను

: జాన్వీ కపూర్ సరదా వ్యాఖ్యలు

బాలీవుడ్ ప్రముఖ టాక్ షో ‘కాఫీ విత్ కరణ్’ కొత్త సీజన్ ఆసక్తికరంగా సాగుతోంది. సల్మాన్ ఖాన్, విజయ్ దేవరకొండ, రష్మిక మందన తర్వాత ఇప్పుడు మూడో ఎపిసోడ్‌కు బాలీవుడ్ నటులు వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ ముఖ్య అతిథులుగా రాబోతున్నారు. శనివారం విడుదలైన ఈ ఎపిసోడ్ టీజర్, షోపై అంచనాలను పెంచుతోంది. ఇందులో వరుణ్, జాన్వీ ఇద్దరూ హోస్ట్ కరణ్ జోహార్‌పై చేసిన ఫన్నీ కామెంట్స్ హైలైట్‌గా నిలిచాయి.
టీజర్ ప్రకారం, ఒకానొక సమయంలో కరణ్ జోహార్ తమ ఇద్దరితో మాట్లాడటం పూర్తిగా ఆపేశారని వరుణ్, జాన్వీ వెల్లడించారు. “మీ ఇద్దరి వల్ల నేను చాలా హర్ట్ అయ్యాను,“ అని కరణ్ చెప్పగా, జాన్వీ కపూర్ కలుగజేసుకొని, “మీరు మాతో మాట్లాడటం ఆపేశాక నేను బరువు కూడా పెరిగాను“ అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి వరుణ్ ధావన్ స్పందిస్తూ, “కరణ్, మీరు చాలా డ్రామాటిక్‌గా ప్రవర్తించారు. అప్పుడు మీరు ‘కభీ ఖుషీ కభీ గమ్’లోని బచ్చన్‌లా మారిపోయి ‘నేను పెద్దవాడిని, అది నా హక్కు’ అన్నట్టు వ్యవహరించారు“ అంటూ కరణ్‌ను ఆటపట్టించారు.
అయితే కరణ్ వారిపై ఎందుకు అలకబూనాడనే పూర్తి కారణం తెలియకపోయినా, ప్రస్తుతం వారి మధ్య అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఎపిసోడ్‌లో మరో స్పెషల్ అట్రాక్షన్‌గా రాపిడ్ ఫైర్ రౌండ్‌లో నటుడు అర్జున్ కపూర్ కూడా జాయిన్ అయ్యారు. కెరీర్, పెళ్లికి సంబంధించిన సలహాలు ఎవరి నుంచి తీసుకుంటావని కరణ్ అడగ్గా, వరుణ్ వెంటనే అర్జున్ కపూర్ పేరు చెప్పాడు.





సరైన అవకాశం కోసం ఎదురుచూడొద్దు

: నటి తమన్నా

సరైన అవకాశం కోసం ఎదురుచూడటం అనేది అతిపెద్ద అబద్ధమని ప్రముఖ నటి తమన్నా అన్నారు. విజయం సాధించాలంటే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలే కానీ... పరిపూర్ణమైన అవకాశం వస్తుందని ఎదురుచూస్తూ కూర్చోకూడదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రయాణం గురించి తమన్నా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.
తాను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు గొప్ప నటిని కానీ, అద్భుతమైన డ్యాన్సర్‌ను కానీ కాదని తమన్నా గుర్తుచేసుకున్నారు. పరిశ్రమలోకి వచ్చాక అనుభవం ద్వారానే ప్రతి విషయాన్ని నేర్చుకున్నానని తెలిపారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకోవడానికి, దాన్ని ఆచరణలో పెట్టడమే ఉత్తమ మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు.
జీవితంలో మనం చేసే ప్రతి పని ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని, అది మన కెరీర్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడుతుందని వివరించారు. ఖాళీగా కూర్చొని మంచి అవకాశం కోసం ఎదురుచూసే బదులు, దొరికిన అవకాశాలను ఉపయోగించుకోవాలని, అదే నిజమైన విజయ రహస్యమని తమన్నా పేర్కొన్నారు. ప్రస్తుతం తమన్నా సినిమాలు, ఓటీటీ వెబ్ సిరీస్‌లతో కెరీర్‌లో చురుగ్గా కొనసాగుతున్నారు.
ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా

కొత్త ప్రాజెక్ట్‌పై ‘కాంతార’ బ్యూటీ రుక్మిణి ఎమోషనల్ పోస్ట్!



కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ముఖ్యంగా ‘కాంతార: చాప్టర్ 1’లో అవకాశం దక్కించుకున్న తర్వాత దక్షిణాది సినీ పరిశ్రమలో, ప్రత్యేకించి టాలీవుడ్‌లో ఆమెకు విపరీతమైన ఆదరణ పెరిగింది. ఈ క్రమంలోనే ఆమె తాజాగా ఒక కొత్త తెలుగు చిత్రానికి సంతకం చేసింది. ‘ఒకే ఒక జీవితం’ చిత్రంతో ఆకట్టుకున్న శ్రీ కార్తీక్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ, చిత్రబృందం ఒక చిన్న గ్లింప్స్‌ను కూడా విడుదల చేసింది. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రుక్మిణి వసంత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకుంది. “తొలిసారి కథ విన్నప్పటి నుంచే ఈ సినిమాపై మా బృందంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సెట్‌లోకి అడుగుపెట్టే ప్రతి క్షణం ఎంతో ఉత్కంఠగా అనిపించింది. ఈ సానుకూల వాతావరణం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. మొదటి రోజు నుంచే మాలో ఈ ఉత్సాహాన్ని నింపిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. ఇలాంటి మరిన్ని అద్భుతమైన అనుభవాలు ఎదురుకావాలని ఆశిస్తున్నాను” అని ఆమె పేర్కొంది. ఈ సందర్భంగా షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఆమె షేర్ చేసింది. ఈ చిత్రంలో రుక్మిణి ‘తార’ అనే కీలక పాత్రలో కనిపించనుంది. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుణి సినీ కార్పొరేషన్ బ్యానర్లపై మిసాయ్ కృష్ణ, దేవ్ రామ్‌నాథ్, శ్రీ కార్తీక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం.

వెంకీ-త్రివిక్రమ్ ‘ఆదర్శ కుటుంబం‘.. ట్రైలర్ వచ్చేసింది!



విక్టరీ వెంకటేశ్ అభిమానులకు, సినీ ప్రియులకు చిత్రబృందం తీపి కబురు అందించింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ఆదర్శ కుటుంబం‘ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తోంది. ‘ఏకే-47‘ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇవాళ హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ట్రైలర్ ను ఆవిష్కరించారు.ట్రైలర్ విడుదలను ప్రకటిస్తూ చిత్ర నిర్మాణ సంస్థ ఒక సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేశ్ ఎరుపు రంగు చొక్కా, స్టైలిష్ కళ్లద్దాలతో చిరునవ్వు చిందిస్తూ ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన తారాగణం కూడా ఈ పోస్టర్‌లో మెరిశారు. ‘ట్రైలర్ అవుట్ నౌ‘ అనే క్యాప్షన్‌తో కూడిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.
ఈ చిత్రం ఫ్యామిలీ ఎమోషన్స్, వినోదం, యాక్షన్ అంశాల కలయికగా రూపొందిందని చిత్ర బృందం పేర్కొంది. త్రివిక్రమ్ శైలి సంభాషణలు, వెంకటేశ్ మార్క్ కామెడీ టైమింగ్, కుటుంబ సెంటిమెంట్‌తో పాటు ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. వైవిధ్యభరితమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.
ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డు స్థాయి వ్యూస్‌తో దూసుకుపోతోంది. వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే వెంకటేశ్, తనదైన శైలిలో వెండితెరపై మ్యాజిక్ చేసే త్రివిక్రమ్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

60 అడుగుల నయనతార కటౌట్.. రెజీనా ఆసక్తికర ట్వీట్

లేడీ సూపర్ స్టార్ నయనతారపై ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ప్రశంసల వర్షం కురిపించారు. సాధారణంగా అగ్ర హీరోలకు మాత్రమే పరిమితమయ్యే భారీ కటౌట్లను నయనతార కోసం ఏర్పాటు చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఒక నటికి దక్కిన ఈ అరుదైన గౌరవం నిజంగా చారిత్రాత్మకమని ఆమె అభివర్ణించారు. వివరాల్లోకి వెళితే, తమిళనాడులో ‘మూకుత్తి అమ్మన్ 2‘ చిత్రం ప్రచారంలో భాగంగా నయనతారకు 60 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఎరుపు, బంగారు వర్ణ వస్త్రాలతో అమ్మవారి అలంకారంలో, చేతిలో త్రిశూలం ధరించిన నయనతార కటౌట్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కటౌట్ ఫొటోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న రెజీనా, నయనతారను ప్రత్యేకంగా అభినందించారు. “ఒక నటి కోసం ఇంత భారీ కటౌట్ ఏర్పాటు చేయడం బహుశా ఇదే తొలిసారి. నయనతార సంకల్ప బలానికి, విజయం పట్ల ఆమెకున్న అంకితభావానికి ఇది నిదర్శనం“ అని రెజీనా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె నయనతారను ట్యాగ్ చేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నారు.
దక్షిణాది చిత్ర పరిశ్రమలో భారీ కటౌట్లు స్టార్‌డమ్‌కు నిలువుటద్దాలుగా నిలుస్తాయి. ఇప్పటివరకు కేవలం అగ్ర హీరోలకు మాత్రమే ఈ స్థాయిలో కటౌట్లు ఏర్పాటు చేసే సంప్రదాయం కొనసాగుతోంది. ఆ సంప్రదాయాన్ని అధిగమిస్తూ, ఒక నటి కోసం 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేయడం సినీ చరిత్రలో ఒక మైలురాయిగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

